రోడ్డు పనులు చేపట్టండి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

బోడుప్పల్‌: మారుతీనగర్‌లో రోడ్డు పనులు చేట్టాలంటూ ఆకాలనీ వాసులు కమిషనర్‌ రాంలింగంకు వినతి పత్రం అందజేశారు. రోడ్డు వేయడాన్ని పక్క కాలనీవాసులు అడ్డు చెబుతున్నారని, వారితో మాట్లాడి తమ కాలనీ రోడ్డుకు పరిష్కారం చూపాలని వినతి పత్రంలో కోరారు. కమిషనర్‌ స్పందించి డిఈని పంపి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు వెల్లడించారు. వినతి పత్రం అందజేసిన వారిలో కాలనీ ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేటినుంచి రుద్ర యాగ మహోత్సవం

బోడుప్పల్‌: లక్ష్మినగర్‌ (హుడా)కాలనీలోని లక్ష్మిగణపతి దేవాలయంలో శనివారం నుంచి శత చండీ శత రుద్ర యాగ మహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు వెల్లడించారు. ఈనెల 6 నుంచి 14వ తేదీ వరకు వారాహి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నవాహ్నిక దీక్ష, శత చండీ, శత రుద్రయాగం, చండీ పారాయణ, రుద్రాభిషేకం, మూల మంత్రహోమాలు, మంత్ర పుష్పం, మహా పూర్ణాహుతి, యాగ భస్మ ధారణ, దీక్ష విరమణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ముంపు ప్రాంతంలో పర్యటించిన కమిషనర్‌



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్‌

బోడుప్పల్‌: 17వ డివిజన్‌ పరిధిలోని మారుతీనగర్‌లో ముంపు ప్రాంతాన్ని శుక్రవారం కమిషనర్‌ రాంలింగం, డీఈ బాలమురళి, స్థానిక కార్పొరేటర్‌ పోగుల నర్సింహారెడ్డి పర్యటించారు. ముంపు ప్రాంతాన్ని పరిశీలించి స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్య తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్‌ రాంలింగం మాట్లాడుతూ రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సత్వర చర్యలు చేపడతామన్నారు. మారుతీనగర్‌, మణికంఠ కాలనీ, శివపురి ఫేస్‌ 2, రాంరెడ్డి కాలనీలు ముంపు ప్రాంతంలో ఉన్నాయని, వాటికి నిధులు కేటాయించి భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో మారుతీనగర్‌ కాలనీ అధ్యక్షులు అంజయ్యయాదవ్‌, మాజీ అధ్యక్షులు సత్యశీలారెడ్డి, కాలనీవాసులు రజనీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాను తిరిగి అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేయాలి

మల్లాపూర్‌: మల్లాపూర్‌ డివిజన్‌ పరిధిలోని అశోక్‌నగర్‌లో పల్లెదవాఖానాను ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం మేడ్చల్‌ జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌కు అశోక్‌నగర్‌ కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. నిరుపేదలు ఎక్కువగా ఉన్న నెహ్రూనగర్‌, అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేయాల్సిన పల్లెదవఖానను హెచ్‌బీ కాలనీలో డివిజన్‌లో ఎలా ఏర్పాటు చేస్తారని కలెక్టర్‌ దృష్టికి తీసుకు వెళ్లారు. అనంతరం స్థానికులు మెడికల్‌ ఆఫీసర్‌ సౌందర్యలతో మట్లాడారు. పల్లె దవఖాన ఏర్పాటు చేయాడానికి చాలా కమ్యూనిటీహాల్స్‌ ఉన్నాయని కావాలనే హెచ్‌బీ కాలనీకి అధికారులు మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో బోదాసు లక్ష్మీనారాయణ,మొసలి శ్రీనివాస్‌రెడ్డి, నాగేంధర్‌, విక్టరీ జోష్‌,రాము తదితరులున్నారు.

చెత్త వేయకుండా రాత్రంతా కాపలా



మల్లాపూర్‌ సెయింట్‌ ఆన్స్‌ చర్చి వద్ద కాపలా కాస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

మల్లాపూర్‌: రోడ్లపై ఎక్కడా పడితే అక్కడా ప్రజలు చెత్తను పార బోస్తు న్నారు. చెత్తను వేయకుండా మల్లాపూర్‌ డివిజన్‌కు చెందిన పారిశుద్ధ్య కార్మికులు చక్కని ఐడియాతో మల్లాపూర్‌ సెయింట్‌ ఆన్స్‌ చర్చి వద్ద ఉదయం, మధ్యాహ్నం ,రాత్రికి ఒక్కరికి చొప్పున పారిశుద్ధ్య కార్మికులు కుర్మన్న, భరత్‌ కుమార్‌, అనుష, జవాన్‌ యాదగిరి కాపలా ఉంటున్నారు. దీంతో చెత్తను పార బోయడానికి వచ్చే వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఇంటి ముందుకు వచ్చే చెత్త ఆటోకి వేయాలని అవగాహన కల్పించి పంపించి వేస్తున్నామని పారిశుద్ధ్య కార్మికుడు కుర్మన్న తెలిపారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

ఉప్పల్‌: సీఎం సహాయ నిధి పేదలకు వరమని ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. చిలుకానగర్‌ ప్రాంతానికి చెందిన జి.కోదండు అనారోగ్యంతో బాధపడుతుండటంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 5 లక్షల ఎల్‌వోసిని మంజూరు చేయించి శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేసారు. కార్యక్రమంలో కాం గ్రెస్‌ నేతలు చెన్‌ రెడ్డి రఘుపతి రెడ్డి, ఈగ ఆంజనేయులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌



ఆస్పత్రి సూపరింటెండెట్‌తో మాట్లాడుతున్న కలెక్టర్‌ గౌతమ్‌

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మెరుగైన సేవలందించాలని కలెక్టర్‌ గౌతమ్‌ ఆదేశించారు. మల్కాజిగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిని ఆయన అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ సునీత, ఆర్‌ఎంఓ సంగీత్‌ను ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలగురించి ఆరా తీశారు. ఆస్పత్రిలో ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు వారికి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీసారు. వర్షాకాలంలో సీజనల్‌ వ్యాధులైన మలేరియా,డెంగూ వ్యాధుల బారిన పడకుండా మెరుగైన సేవలందించాలని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆస్పత్రి ఆవరణం పరిశుభ్రంగా లేకపోవడాన్ని ఆయన గమనించి పలు సూచనలు చేశారు.

ఫిర్యాదుల వెల్లువ

ఆస్పత్రిని అకస్మిక తనిఖీ చేసిన సమయంలో ఆయన దృష్టికి పలు ఫిర్యాదులు రావడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది సకాలంలో రావడం లేదని, మందుల కోసం అడిగినా లేవని డిస్పెన్సరీలోని సిబ్బంది దురుసుగా సమాధానం చెప్పుతున్నారని ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. ముఖ్యంగా రోగులు, వారి అటెండర్లకు ఆహారం అందించే కాంట్రాక్ట్‌ పొందిన కాంట్రాక్టర్‌ తరుపున సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆయనకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రి ఆవరణంలో కుక్కలు తిరుగుతున్నా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రోగుల అటెండర్లు వాపోయారు. అన్ని సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ ఉన్నతాధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రఘునాథస్వామి, డీసీహెచ్‌ కోట్యా నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో మెరుగైన సేవలను అందించాలి

ఉప్పల్‌: వివిధ సమస్యలతో అసుపత్రులకు వచ్చే రోగులకు వెంటనే మెరుగైన చికిత్స అందించే విధంగా డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని మేడ్చల్‌- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ అదేశించారు. అసుపత్రిలో వసతులపై వచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆయన ఉప్పల్‌ ప్రాథమిక వైద్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో, ఇతర వైద్య సిబ్బందితో కలిసి అకస్మికంగా తనిఖీ చేసారు. అసుపత్రిలో అన్ని వార్డులను, ఓపిలను, ల్యాబ్‌, ఐసియూ , అక్సిజన్‌ యూనిట్‌లను ఎక్స్‌ రే ప్రసూతి గది, నవజాత శిశు కేంద్రాలను సునిశితంగా పరిశీలించారు. అసుపత్రిలో అందుతున్న వైద్య సదూపాయాలపై అరా తీసారు. కార్యక్రమంలో హెచ్‌ కోటియా నాయక్‌, సౌందర్యలత, బోగ ప్రకాశ్‌ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాన్ని అల్వాల్‌కు తరలించాలి



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

అల్వాల్‌: అల్వాల్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాన్ని అల్వాల్‌లో ఏర్పాటుచేయాలని కోరుతూ బీజేపీ నాయకులు శుక్రవారం అల్వాల్‌లోని బాబాసాహెబ్‌ డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అల్వాల్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం ప్రకాశ్‌నగర్‌ వల్లభ్‌నగర్‌లో ఉండటం వల్ల అల్వాల్‌, మచ్చబొల్లారం, వెంకటాపురం డివిజన్లకు చెందిన భూములను రిజిస్ట్రేషన్ల కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్‌ మల్లారెడ్డి, డిఎస్‌. వెంకటేష్‌, సుజాత పాల్గొన్నారు.

బోనాల జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలి

గౌతంనగర్‌: బోనాల జాతరకు ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్‌ మేకల సునీతరాముయాదవ్‌ అన్నారు. ఈ నెల 28న జరగనున్న బోనాల వేడుకలను దృష్టిలో పెట్టుకొని శుక్రవారం గౌతంనగర్‌లో కార్పొరేటర్‌ సునీతరాముయాదవ్‌ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గౌతంనగర్‌ డివిజన్‌లో అమ్మవారి ఆలయాల పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

అమ్మ పేరు మీద ఓ మొక్క

మల్లాపూర్‌: శ్యామ్‌ ప్రసాద్‌ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని అమ్మ పేరు మీద ఒక మొక్కను నాటాలని ప్రధాని పిలుపు మేరకు శుక్రవారం నాచారం డివిజన్‌ బీజేపీ అధ్యక్షులు మల్కా ప్రకాష్‌ అమ్మ పేరు లక్ష్మీబాయ్‌ మీద మొక్కను నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు.

కుషాయిగూడ పీఎస్‌లో ఎస్‌ఐల బదిలీ

కుషాయిగూడ: కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ముగ్గురు ఎస్‌ఐలు బదిలీ కాగా కొత్తగా నలుగురు ఎస్‌ఐలు ఇక్కడకు బదిలీపై వచ్చారు. కుషాయిగూడలో విధులు నిర్వహిస్తున్న నాగుల ఉపేందర్‌ యాదవ్‌ రాజపేట పీఎస్‌, పోతురాజు భద్రయ్య చైతన్యపురి, మిట్టకోలు ప్రసాద్‌ ఎల్‌బీనగర్‌ పోలీస్‌స్టేషన్లకు బదిలీపై వెళ్లారు. మరో ఎస్‌ఐ షఫీ ఏసీబీ కేసులో జైల్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. సరూర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ నుంచి కుడుముల సునీల్‌కుమార్‌, మాడ్గుల్‌ నుంచి రేకల రాములు, సీసీఎస్‌ ఎల్‌బీనగర్‌ నుంచి బి. శ్రీనివాస్‌, రాజపేట నుంచి ఎస్‌. సుధాకర్‌రెడ్డి కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు.

ఎవరికి కష్టం వచ్చినా ఆదుకుంటా

ఉప్పల్‌: ఉప్పల్‌ నియోజకవర్గంలో ఎవ్వరికి కష్టం వచ్చిన తన వంతు సహాయం చేసి ఆదుకుంటానని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్‌ డివిజన్‌ లక్ష్మారెడ్డి కాలనికి చెందిన మల్లేష్‌ కుమారుకి మంజూరైన రూ.ఐదు లక్షల సీఎంఆర్‌ఎఫ్‌ ఎల్‌వోసిని సాంక్షన్‌ చేయించి బాదిత కుటుంబానికి శుక్రవారం అందజేసారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్‌, ఆకుల మహేందర్‌ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



కుషాయిగూడ: లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ కాప్రా, ఏఎస్‌రావునగర్‌ చారిటబుల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం కుషాయిగూడలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్‌ అధ్యక్షురాలు ఎం. శ్రీదేవి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు కంటి, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు

రామంతాపూర్‌: సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం నుంచి కేసీఆర్‌నగర్‌ సర్వీస్‌ రోడ్డులో ఇరువైపులా రోడ్డును ఆక్రమించుకుని ఫుట్‌పాత్‌లపై ఉన్న షెడ్లను, డబ్బాలను శుక్రవారం టౌన్‌ ప్లానింగ్‌ అధికారి సురేష్‌ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య సిబ్బంది తొలగించారు. పాదచారులకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్న ఫుట్‌పాత్‌ ఆక్రమణలను తొలగించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పలువురు ఎస్‌ఐల బదిలీ

ఉప్పల్‌: ఉప్పల్‌ పోలీస్‌ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐలను బదిలీ చేస్తూ రాచకొండ సీపీ తరుణ్‌ జోషి ఉత్తర్వులను జారీ చేశారు. మధుసూదన్‌ను మహేశ్వరం పోలీస్‌ స్టేషన్‌కు, రమేష్‌ను నాగోల్‌కు, ఎస్‌ కోటేశ్వర్‌రావును బాలాపూర్‌ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసారు. ఉప్పల్‌ ట్రాఫిక్‌ పీఎస్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న చిరంజీవిని ఉప్పల్‌కు బదిలీ చేశారు. ఎల్‌బీనగర్‌ పీఎస్‌లో పని చేస్తున్న టి. మధు, వనస్థలిపురంలో పని చేస్తున్న ఎ. మాధవ రెడ్డి, భువనగిరి ఎస్‌వోటిలో పని చేస్తున్న జి. రఘురాములు ఉప్పల్‌కు బదిలీపై రానున్నారు.

కబ్జా సాధింపు చర్యలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే

విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్‌ నేతలు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

గౌతంనగర్‌: మల్కాజిగిరి నియోజవకర్గంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌ నేత మైనంపల్లి హన్మంతరావు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని బీఆర్‌ఎస్‌ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని కార్పొరేటర్‌ మేకల సునీత రాముయాదవ్‌ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మల్కాజిగిరిలో మైనంపల్లి హన్మంతరావు కొత్త సంస్కృతికి తెరలేపారన్నారు.అభివృద్ధి కోసం అధికారుల వద్దకు వెళుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి సహకరించవద్దంటూ అధికారులను ఇబ్బందులకు గరి చేయడం దారుణమన్నారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిపై మౌలాలి ఆర్టీసి కాలనీలో కాంగ్రెస్‌ నాయకులు దాడికి పాల్పడే విధంగా వ్యవహరించడాన్ని వారు ఖండించారు. బీఆర్‌ఎస్‌ పార్టీ కార్పొరేటర్‌ మేకల సునీత రాముయాదవ్‌, మాజీ కార్పొరేటర్‌ జగదీష్‌గౌడ్‌, సీనియర్‌ నాయకులు రావుల అంజయ్య, బద్దం పరుశురాంరెడ్డి, జేఏసీ వెంకన్న, జీకే హన్మంతరావు, ఉస్మాన్‌, ఉపేందర్‌రెడ్డిలు అన్నారు.

గృహిణి ఆత్మహత్య



మౌనిక (ఫైల్‌)

మల్కాజిగిరి: మల్కాజిగిరి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ సత్యనారాయణ తెలిపిన మేరకు.. మల్కాజిగిరి మారుతినగర్‌కు చెందిన సముద్రాల ఈశ్వర్‌ మౌనిక భార్య భర్తలు. శుక్రవారం ఉదయం మౌనిక ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు కుటుంబ సభ్యులు మౌనిక మృతికి భర్త వేదింపులే కారణమని ఫిర్యాదు చేశారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడిస్తాం

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్‌: ప్రజా సమస్యల పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వీడకపోతే ప్రజలతో కలిసి ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడిస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అధికారులతో కలిసి శుక్రవారం కొకూర్‌ తదితర ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ఏళ్ల తరబడి సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని పరిష్కరించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించడం వలన ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొనవలసి వస్తుందన్నారు. కనీస వసతులు కల్పించడంలో సైతం విఫలమయ్యారన్నారు. జలమండలి, జీహెచ్‌ఎంసి అధికారులను సమస్యలపై నిలదీశారు. నిధుల కొరత, సిబ్బంది కొరత అంటూ దాటవేయడం సరికాదన్నారు. అనంతరం బస్తీలో బైఠాయించి ఆందోళన చేశారు. రాజీవ్‌ గృహకల్ప, వాంబే గృహ నిర్మాణాలు జరిగి దశాబ్దాలు కావస్తున్న మౌళిక వసతుల కల్పించడంలో ప్రభుత్వాలు, అధికారులు విఫలమయ్యారన్నారు. ఇదిలా ఉండగా బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేను స్థానికులు సమస్యలపై నిలదీశారు. ఎమ్మెల్యేగా గెలిచి ఆరు నెలల గడుస్తున్నా ఒక సమస్య సైతం పరిష్కారం చేయలేకపోయారు అని ప్రశ్నించారు. కేవలం పర్యటనలు, వినతి పత్రాలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. దీంతో ఎమ్మెల్యే పర్యటన ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యే సర్ది చెప్పడానికి ప్రయత్నించారు. మాకు మాటలు వద్దు సమస్యలు పరిష్కరించడం అంటూ వాదించారు.

ఇండోర్‌ స్టేడియంలో వసతులు కల్పించండి

ఉప్పల్‌: ఉప్పల్‌ షటిల్‌ బ్యాడ్మింటన్‌ ఇండోర్‌ స్టేడియంలో కనీస వసతులు లేక పడుతున్నారని వెంటనే ఏర్పాటు చేయాలని ఎల్‌బీనగర్‌ జోనల్‌ కమిషనర్‌ హేమంత కేశవ పాటిల్‌ అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసి స్పోర్ట్స్‌ అండ్‌ ఎస్టేట్‌ కు సంబంధించిన ఉప్పల్‌ ఇండోర్‌ స్టేడియాన్ని సర్కిల్‌ డీసీ ఆంజనేయులు, ఈఈ నాగేందర్‌తో,స్పోర్ట్స్‌ ఏడి వెంకటరెడ్డితో కలిసి శుక్రవారం తనిఖీ చేసారు. అక్కడే ఆడుతున్న క్రీడాకారులను వసతులపై అరా తీసారు.

అన్నదానం

కుషాయిగూడ: అమావాస్యను పురస్కరించుకొని కుషాయిగూడ మారుతీ మిత్రమండలి ఆధ్వర్యంలో శుక్రవారం కుషాయిగూడ పోచమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మల్కాజిగిరిని అభివృద్ధి చేసుకుందాం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



భరత్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్‌: మచ్చబొల్లారం డివిజన్‌ కొకూర్‌, భరత్‌నగర్‌ బస్టాప్‌ వద్ద స్థానిక సమస్యలపై ధర్నా నిర్వహించిన ప్రజలకు శుక్రవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌ రెడ్డి హాజరై మద్దతు తెలిపారు. అనంతరం స్థానికవాసులతో కలిసి భరత్‌నగర్‌, రాజీవ్‌గృహకల్ప, వాంబే కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా మల్కాజిగిరిని అభివృద్ధి చేసుకుందామన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్‌, వీధి దీపాలు వంటి సమస్యలతో బాధపడుతున్నారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి ఈ సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లానని, కానీ అధికారులు నిధులు లేవని, సరైన సిబ్బంది లేరని అంటున్నారన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి శ్రీధర్‌బాబుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం భాస్కర్‌, మేనేజర్‌ మల్లిఖార్జున్‌, జీహెచ్‌ఎంసీ డీఈ కార్తీక్‌, ఏఈ రవళి, విద్యుత్‌ ఏఈ వేణుగోపాల్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.